సీఎంకు ఆహ్వానం



అంబర్‌పేట: కుమారుడి వివాహానికి రావాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్ రెడ్డి ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పెండ్లిపత్రిక అందజేశారు. వచ్చే నెల 12వ తేదీన కుమారుడు నరేస్‌సాయిరెడ్డి వివాహానికి విచ్చేసి ఆశీర్వదించాలని కోరారు.

మట్టి దిబ్బలను తొలగించండి



మట్టిదిబ్బలను చూపిస్తున్న సీపీఎం నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లి ఎల్‌ఐజీ క్వార్టర్స్‌లో పేరుకుపోయిన మట్టి దిబ్బలు, చెత్తాచెదారాన్ని తొలగించాలని డీవైఎఫ్‌ఐ నాయకుడు మహేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో బస్తీ సమస్యలపై పర్యటించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ... డ్రైనేజీ పైప్‌లైన్‌లు మార్చి చెత్త మట్టిని మొత్తాన్ని రోడ్డుమీద పడేసి వెళ్లిపోయారని. పది రోజులు గడుస్తున్నా మట్టి దిబ్బలను తరలించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పేరుకుపోయిన మట్టి దిబ్బల వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు.

వైభవంగా బండమైసమ్మ ఆలయ వార్షికోత్సవం



కవాడిగూడ: బండమైసమ్మ నగర్‌లో ప్రసిద్ధిగాంచిన బండమైసమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అభిషేకాలు అర్చనలతో బండమైసమ్మ నగర పరిసర ప్రాంతాలలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నాయి. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహిళ అదృశ్యం



సుగుణమ్మ (ఫైల్)

కాచిగూడ: రైలు ఎక్కి నగరానికి వచ్చిన ఓ మహిళా అదృశ్యమైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా మల్దెకల్కు చెందిన సుగుణమ్మ (45) భర్త కృష్ణతో కలిసి ఈ నెల 14న గద్వాల్ రైల్వే స్టేషన్‌లో ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో దిగింది. భర్త కృష్ణ రైల్వే స్టేషన్ గేటు వద్దకు వెళ్లి వెనుకకు చూడగా భార్య కనిపించలేదు. పరిసర ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో భర్త కృష్ణ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముషీరాబాద్ బీఆర్‌ఎస్ సీనియర్ నేత గణేష్ మృతి



ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన సీనియర్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గణేష్‌ముదిరాజ్(55) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. రెండేళ్ల క్రితం ఆయనకు పక్షవాతం రావడంతో అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం ఆయన ఆరోగ్యం క్షీణించడం కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఆస్పత్రిలో మృతి చెందారు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి ఉద్యమ నాయకుడిగా, సామాజిక కార్యకర్తగా మంచి పేరు తెచ్చుకున్నాడు.

◆ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, శ్రీధర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, బీజేపీ నాయకులు అనిల్‌కుమార్, కంచిముదిరాజ్, కుషాల్‌గౌడ్ తదితరులు గణేష్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. గణేష్ అంత్యక్రియలు ముషీరాబాద్‌లో శ్మశానవాటికలో జరిగాయి.

ఇదే మంచి అవకాశం..!

- ఈ నెల ఆఖరు వరకు చివరి గడువు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు
- నిర్దేశించిన లక్ష్యంలో 80 శాతం వసూలు
- క్షేత్రస్థాయి ఆస్తిపన్ను వసూలులో సిబ్బంది నిర్లక్ష్యం
- 2300 రెడ్ నోటీసులు సిద్ధం చేసిన అధికారులు

ఆస్తిపన్నుపై విధించిన వడ్డీపై 90 శాతం రాయితీ



అంబర్‌పేట: జీహెచ్‌ఎంసీ ఆస్తిపన్నుపై విధించిన వడ్డీపై 90 శాతం రాయితీని ప్రకటించింది. ప్రకటించిన రాయితీ ఈనెల ఆఖరు వరకు గడువును నిర్ధారించింది. అంబర్‌పేట సర్కిల్ పరిధిలో అంబర్‌పేట నియోజకవర్గంతో పాటు అదనంగా హిమాయత్‌నగర్ డివిజన్ వస్తుంది. జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 పరిధిలో ఆస్తి పన్ను వసూలు లక్ష్యం రూ.56 కోట్లు కాగా జీహెచ్‌ఎంసీ సర్కిల్ అధికారులు ఇప్పటి వరకు రూ.43 కోట్ల మేర వసూలు చేశారు. నిర్దేశించిన లక్ష్యానికి 80 శాతం వసూలు అయ్యాయి. మరో 15 రోజుల్లో మిగతా 20 శాతం వసూలు చేయాల్సి ఉంది. 15 రోజుల్లో మొండి బాకాయిలు వసూలు అధికారులకు సవాల్.

రెడ్ నోటీసులు... రెడీ.!

మొండి బాకాయిదారులపై అధికారులు ప్రత్యేక కసరత్తు చేశారు. రెడ్ నోటీసులు జారీ చేసి వసూలుకు సిద్ధమవుతున్నారు. సర్కిల్ పరిధిలో 2300 మొండి బాకాయిదారులను గుర్తించి రెడ్ నోటీసులను సిద్ధం చేశారు. రెడ్ నోటీస్ జారీ చేసిన అనంతరం ఆస్తి పన్ను చెల్లించనివారి ఆస్తులను సీజ్ చేసేందుకు అధికారులు వెనుకాడరు. యుద్ధ ప్రాతిపదికన రెడ్ నోటీటీసులు నేటి నుంచి జారీ చేసి ఆస్తి పన్ను వసూలుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు.

గుర్తించిన వాటికే ఆస్తి పన్నా?..

సర్కిల్ పరిధిలో ప్రతి ఏడాది ఆస్తి పన్ను వసూలు లక్ష్యం రూ.55 – 57 కోట్ల మేరకు ఉంటుంది. జీహెచ్‌ఎంసీ అధికారులు ఆస్తి పన్ను చెలించే వారి నుంచి మాత్రమే వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంప్రదాయ ఆస్తి పన్ను వసూలుకే మొగ్గు చూపుతున్నారే తప్ప కొత్త వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదని విమర్శలు వస్తున్నాయి. ప్రతి ఏటా ఎన్నో కొత్త భవనాలు వెలుస్తున్నప్పటికీ లక్ష్యం మాత్రం అదే ఉండటం గమనార్హం. క్షేత్రస్థాయి సిబ్బంది ఆస్తి పన్ను వసూళ్లలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు పలువురు అనుమానిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఆస్తిపన్ను చెల్లించండి అభివృద్ధికి సహకరించండి: డీఎంసీ మారుతీ దివాకర్

సర్కిల్ పరిధిలో సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 డీఎంసీ మారుతీ దివాకర్ కోరారు. ఆస్తి పన్నుపై విధించిన వడ్డీపై 90 శాతం రాయితీ అవకాశం ప్రభుత్వం కల్పించిందని దానిని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల చివరి నాటికి 90 శాతం రాయితీ ఉందని చెల్లించే వారు త్వరపడాలని కోరారు. ఆస్తి పన్ను చెల్లింపునకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే అపార్ట్‌మెంట్, కాలనీ అసోసియేషన్‌ల వారు ఉమ్మడిగా ఆస్తి పన్ను చెల్లిస్తానంటే తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో విచ్చేసి ఆస్తి పన్ను తీసుకుంటారన్నారు.

మహిళలకు సముచిత స్థానం కల్పించాలి



ఎస్వీ కేంద్రంలో ఇందిరాశోభన్‌ను సత్కరిస్తున్న లింగబలిజ సంఘం ప్రతినిధులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మహిళలకు సముచిత స్థానం కల్పించినప్పుడే ఆ దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ నాయకురాలు ఇందిరాశోభన్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటపాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఇందిరాశోభన్ మాట్లాడుతూ... నేడు మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని అన్నారు. అంతరిక్షానికి సైతం పురుషులతో సమానంగా సై అంటున్నారని చెప్పారు. అందుకే స్త్రీలను కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పని ప్రదేశాలలో, పనిలో సముచిత స్థానం కల్పిస్తూ గౌరవిస్తే వారు మరింత ముందుకు సాగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మహిళా అధ్యక్షురాలు సూర్యశ్రావని మాశెట్టి, ప్రధాన కార్యదర్శి విద్యుత్ లత, కోశాధికారి మార్గపు అశ్విని, రాష్ట్ర అధ్యక్షులు పట్లోళ్ల సంగమేశ్వర్, ప్రధాన కార్యదర్శి దినేష్‌పాటిల్, నాయకులు శెట్టి శివకుమార్, రాచప్ప తదితరులు పాల్గొన్నారు.

సిగ్నళ్ల వద్ద గ్రీన్ రూఫ్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్

ముషీరాబాద్: ఎండ తీవ్రత నుంచి తట్టుకోవడానికి ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద గ్రీన్ రూఫ్ ఏర్పాటు చేయాలని ప్రొగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఎక్కువ ఉండటంతో ప్రయాణికులు సిగ్నళ్ల వద్ద అధిక సమయం వెచ్చించాల్సి వస్తోందన్నారు. దీని వల్ల ద్విచక్ర వాహనాదారులు వడదెబ్బకి గురవుతున్నారని పేర్కొన్నారు. మార్చి నెలలోనే ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరుకుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని జీహెచ్‌ఎంసీ అధికారులు నగరంలో అన్ని సిగ్నళ్ల వద్ద గ్రీన్ రూఫ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. గతేడాది పీవైఎల్ సూచన మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు నమూనాగా జీహెచ్‌ఎంసీ కార్యాలయం సిగ్నల్ వద్ద ఏర్పాటు చేశారన్నారు. ఈ సంవత్సరం సిగ్నళ్ల వద్ద గ్రీన్ రూఫ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, బి.ఎస్.కృష్ణ, కుంభోజి కిరణ్, భీమేష బంగారి శ్రీనివాస్, మల్లేష్, బాలు, ప్రకాష్, శంకర్, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

మొదటి నుంచీ బీఆర్‌ఎస్‌వి దళిత వ్యతిరేక విధానాలే..



లోయర్ ట్యాంక్‌బండ్‌లో కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కవాడిగూడ: మొదటి నుంచీ బీఆర్‌ఎస్ పార్టీ దళిత వ్యతిరేక విధానాలనే అవలంభిస్తోందని సికింద్రాబాద్ పార్లమెంట్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్ యాదవ్ అన్నారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత ప్రజాప్రతినిధుల పట్ల అమర్యాదగా, అవమానపరిచే విధంగా బీఆర్‌ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఏక వచనంతో సంబోధిస్తూ సభా మర్యాదను మంటగలిపారని అన్నారు. బీఆర్‌ఎస్ నేతల తీరుకు నిరసనగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దహనం చేస్తున్నామని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దళిత ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను బర్తరఫ్ చేసిందని గుర్తు చేశారు. నేరెళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఆగడాలను ప్రశ్నించినందుకు దళిత యువకులను అరెస్టు చేసి వారిని చిత్రహింసలకు గురిచేసిన సంఘటన దళిత సమాజం మర్చిపోలేదని అన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే దళిత ముఖ్యమంత్రిని చేస్తానని మోసం చేశారని విమర్శించారు. ఇలా మొదటి నుంచీ బీఆర్‌ఎస్ దళితులకు వ్యతిరేకంగా పని చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అపరిచితులకు మీ ఫోన్ నంబర్లు ఇవ్వొద్దు

పౌర సరఫరాల శాఖ ఈడీటీ రఘునందన్



కాచిగూడ: సార్.. మీ ఫోన్ నంబర్ ఇస్తారా.. లక్కీ డ్రా తీసి గిఫ్ట్ ఇస్తాం.. అని చెప్పి సినిమా టాకీస్‌లు, పెట్రోల్ బంక్‌ల వద్ద కొందరు వ్యక్తులు ఫోన్ నంబర్లను తీసుకునే ప్రయత్నం చేస్తారు. వాళ్లకి ఫోన్ నంబర్లు ఇవ్వొద్దని వినియోగదారుల వ్యవహారాలు, పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్(ఈడీటీ) మాచన రఘునందన్ స్పష్టం చేశారు. వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడారు. కొన్ని వ్యాపార సంస్థలు తెలివిగా సర్వజన ప్రదేశాలలో ఫోన్ నంబర్లను సేకరిస్తున్నారని అన్నారు. ఇలా తీసుకున్న నంబర్లకు ఫోన్ చేసి 'మీకు లక్కీ డ్రాలో గిఫ్ట్ వచ్చింది'అంటూ పలు రకాల మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. పెట్రోల్ బంకు యాజమాన్యాలు, సినిమా టాకీస్‌ల వద్ద జనం జాగృతంగా ఉండి తమ ఫోన్ నంబర్లను ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. డెక్కన్ రిసార్ట్స్ అనే సంస్థ ఇలాగే వేలాది మంది నుంచి ఫోన్ నంబర్లను సేకరించి వారి నుంచి కోట్లాది రూపాయలు దోచుకుని మోసం చేసిందన్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినా ఫలితం లేకుండాపోయిందని తెలిపారు. అందుకే అపరిచితులకు మీ ఫోన్ నంబర్లు ఇవ్వొద్దని సూచించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిరాహార దీక్ష నేడు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఈనెల 17వ తేదీన మధ్యాహ్నం 12గంటలకు ఎస్సీ డీడీ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఏజెన్సీ ప్రొప్రైటర్ దోమల మల్లయ్య తెలిపారు. ఆదివారం బాగ్ లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లయ్య మాట్లాడుతూ... నగరంలో వివిధ హాస్టల్స్‌లో వంట మనిషి, కాపాలాదారుడు, బాత్రూమ్‌లు కడిగే వాళ్లను ఏజెన్సీ ద్వారా మ్యాన్‌పవర్ సప్‌లై చేస్తోందన్నారు. కానీ ఆయా ఏజెన్సీలకు బిల్లులను చెల్లించడం లేదన్నారు. ఎన్ని విజ్ఞప్తులు చేసినా స్పందించకపోవడంతో తాము ఈ నిరాహార దీక్ష చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. నాంపల్లిలోని చంద్రవిహార్ కార్యాలయం ఎదుట మంగళవారం 12గంటలకు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 2019 జూలై నుంచి 2021 సెప్టెంబర్ వరకు మాల్ ఏజెన్సీకి 27 నెలల జీతాల బకాయిపడ్డాయని అన్నారు. మొత్తం కోటి 9లక్షల 68వేల రూపాయలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా తమకు చెల్లించాల్సిన బిల్లులను చెల్లించకుండా అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళలు రాణించేలా సహకరించాలి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నాళేశ్వరం శంకరం, వైరాగ్యం ప్రభాకర్, విజయలక్ష్మి

చిక్కడపల్లి: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం అన్నారు. ఆదివారం సాయంత్రం భవాని సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో త్యాగరాయ గాన సభలో వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన మహిళా నీకు వందనం (కవితా సంకలనం) 'నాకు నచ్చిన పుస్తకం'(వ్యాస సంకలనం) ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆవిష్కరించిన వ్యాస సంకలనం పరిశోధకులు, ముందు తరాల వారికి ఈ పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కార గ్రహీత కాంచనపల్లి గోవర్ధనరాజు మాట్లాడుతూ.. కవితా సంకలనంలోని కవితలు మహిళలు సాధించిన విజయాలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు మల్లెల విజయలక్ష్మీ, గంప ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



అశోక్‌నగర్‌లో రాగిజావా పంపిణీ చేస్తున్న వేణుగోపాల్, కేకే గుప్తా, బీవీ రామకృష్ణ

చిక్కడపల్లి: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వక్తలు అన్నారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం అశోక్‌నగర్‌లో రాగిజావాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు టి.వేణుగోపాల్, కేకే గుప్తా, బీవీ రామకృష్ణ, సీహెచ్ భాస్కర్, హేమంత్ కృష్ణ, మల్లిశ్వరి, రామాదేవి, సరళ తదితరులు పాల్గొన్నారు.

దేశ జనగణనలో కులగణన చేపట్టాలి



కాచిగూడలో రోడ్డుపై నిరసన ప్రదర్శన చేస్తున్న జాతీయ బీసీ మహాసభ నాయకులు

కాచిగూడ: దేశ జనగణనలో కులగణన చేపట్టాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలో రోడ్డుపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో బీసీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. దేశ జనాభాలో 60శాతనికి పైగా ఉన్న బీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించి పూర్తిగా అన్యాయం చేస్తోందన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలను నిర్లక్ష్యం చేస్తే దేశంలో బీసీల తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, ప్రదీప్ గౌడ్, భూషణ్ భాస్కర్, సత్యప్రకాష్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ దామోదర్‌నాయక్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకున్న మాస్టర్ దామోదర్ నాయక్

కాచిగూడ: కాచిగూడకు చెందిన మాస్టర్ దామోదర్ నాయక్‌కు యూనివర్సల్ 369 షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా (యుఎస్‌కేఏఐ) లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేసింది. మాస్టర్ దామోర్ నాయక్ అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు యుఎస్‌కేఏఐ చైర్మన్ డాక్టర్ సుమన్ తల్వార్, వ్యవస్థాపకుడు జి.సాయికుమార్, స్టైయిల్ చీఫ్ జి.అక్షయ తెలిపారు. కుద్బిగూడ హెల్త్‌లీగ్ కరాటే టీమ్‌కు చెందిన 7 మంది కరాటే విద్యార్థులు పాల్గొని 7 బంగారు పతకాలు సాధించారు.

ఓయూ సర్క్యులర్ నియంతృత్వానికి నిదర్శనం

సర్క్యులర్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ డిమాండ్

ముషీరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారులు విడుదల చేసిన నియంతృత్వ, ఆంక్షల సర్క్యులర్ తక్షణమే వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ తెలంగాణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌వీ శ్రీకాంత్, పొడపంగి నాగరాజు డిమాండ్ చేశారు. మార్చి 13న ఓయూ వీసీ, రిజిస్ట్రార్ విడుదల చేసిన సర్క్యులర్‌లో ఓయూ పరిధిలోని డిపార్ట్‌మెంట్స్, కళాశాలలు, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎదుల నిరసనలు, ధర్నాలు చేయొద్దని పేర్కొనడం సరికాదన్నారు. ఇది నియంతృత్వానికి వైఖరికి నిదర్శనమన్నారు. విద్యార్థి, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొంటే వారి పైన చట్టప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామని తెలపడాన్ని పీడీఎస్‌యూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కులను హరించే విధంగా యూనివర్సిటీ అధికారులతో సర్క్యులర్ జారీ చేయించడం ప్రభుత్వం అప్రజాస్వామిక పాలనకు నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెడతామని చెబుతూ యూనివర్సిటీల ప్రజాస్వామిక గొంతు నొక్కడం అప్రకటిత ఎమర్జెన్సీ ప్రకటించడం లాంటిదేనని పేర్కొన్నారు. తక్షణమే సర్క్యులర్‌ను వెనక్కి తీసుకుని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రజాస్వామిక వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

కళాకారులు, చిన్నారులతో డాక్టర్ చీమల కోటేశ్వరమ్మ, ఎస్‌వీఆర్ వెంకటేశ్



స్త్రీ లేనిదే సమాజం లేదు

చిక్కడపల్లి: స్త్రీ లేనిదే సమాజం లేదని.. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వక్తలు అన్నారు. కళ్తీ నర్సయ్య చారిటబుల్ ట్రస్టు విశ్వ విఖ్యాత ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో ఆదివారం ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వర్ధమాన నృత్య కళాకారులతో పాటు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షులను అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం ఎంపిక చేసిన పలువురికి గౌతమి నంది, జగత్ విఖ్యాత విశ్వభూషణం అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు డాక్టర్ చీమల కోటేశ్వరమ్మ, డాక్టర్ ఎస్‌వీఆర్ వెంకటేశ్, ఆకుల విద్యాసాగర్, గురూజీ, దైవజ్ఞశర్మ, జి.రాధిక, దుర్గం రమేష్, ప్రభురాజ్, డాక్టర్ వనిత, వెంకట్, సర్వేశ్, మురళీకృష్ణ, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీమిలేయర్‌ను తొలగించే వరకు పోరాడాలి



సదస్సులో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: క్రీమిలేయర్‌ను తొలగించే వరకు పెద్ద ఎత్తున పోరాటం చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆలిండియా అదర్స్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. అధికారం ద్వారా మాత్రమే కులాలకు గౌరవం పెరుగుతుందన్నారు. ఇది రాచరిక వ్యవస్థ కాదు ప్రజాస్వామ్య వ్యవస్థ అని దేశంలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ప్రతి కులానికి ప్రభుత్వంలో ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగా బీసీలకు కూడా గ్రాంట్‌లను మంజూరు చేసి పథకాలను అమలు చేయాలని కోరారు.

◆ మాజీ ఎంపీ వి. హనుమంతరావు మాట్లాడుతూ... దేశంలో అత్యంధిక శాతం ఉన్న బీసీలకు అన్నిరంగాలలో అన్యాయం జరుగుతోందన్నారు. ఓబీసీ రిజర్వేషన్లు పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కామారెడ్డి డిక్లరేషన్ (బీసీలకు 42శాతం రిజర్వేషన్)ను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

◆ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వి. దాన కర్ణాచారి మాట్లాడుతూ... జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన చట్టాలను తీసుకొస్తూ కార్మిక చట్టాలను కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ తొలగించాలని కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జి. కరుణానిధి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. పాండు, రవికుమార్ ముదిరాజ్, రాంరాజు, రామ్మూర్తి, చెన్నయ్య పాల్గొన్నారు.

మంచిగా చదువుకుని భవిష్యత్‌లో రాణించాలి

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



చిక్కడపల్లి: విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లోని ఆంధ్రాకేఫ్ సమీపంలో నిర్వహించిన ఎస్ఆర్‌కే గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలను నడపడం సవాళ్లతో కూడిన విషయమని అన్నారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. తొలుత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ డాక్టర్ జనార్దన్‌రెడ్డి, కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్, ప్రిన్సిపాల్ సుజాత, చైర్మన్ శివరామకృష్ణ, నాయకులు వినయ్‌కుమార్, ముఠాజైసింహ తదితరులు పాల్గొన్నారు.